ఇంటింటికీ వెళదాం.. బాబు తీరుని ఎండగడదాం

- మాజీ మంత్రి విడదల రజిని
- బొప్పూడి, తూబాడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం



బొప్పూడిలో క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని, వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలూరిపేట: చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ, రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం చిలకలూరిపేట మండలంలోని బొప్పూడి గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి ఇచ్చిన ప్రతిహామీ నెరవేర్చిన వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పాలనను, నేటి చంద్రబాబు పాలనను బేరీజువేసి చూసుకొనేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ప్రజలు అడగని హామీలను అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తన పరిపాలన కాలంలో ఉచిత విద్య, వైద్యం, సాగు రంగాలకు తోడ్పాటు అందించారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో పాటు లక్షా 35వేల మందికి ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. అదే చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని, రూ. 3వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తానని అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే అధికార పగ్గాలు అప్పజెబుతామని వెల్లడించారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని కోరారు. రెడ్ బుక్ రాజ్యాంగం పాలనకు చరమగీతం పాడేందుకు, అన్ని వర్గాలకు మేలు చేసే పాలన అందించేందుకు వైఎస్ జగన్ తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు దేవినేని శంకరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అప్పాపురం షేక్ రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కుప్పాల ప్రభుదాస్ నాయుడు, నాయకులు రావిపూడి రాధాకృష్ణ, పర్భూరు సుబ్బారావు, షేక్ సైదా, కారుచోల మీరాబుడే, మైలా రాజేష్, బండారు జయకుమార్, పఠాన్ తలహాఖాన్, బొల్లు శ్రీకాంత్, షేక్ మొఘులా తదితరులు పాల్గొన్నారు.



నాదెండ్లలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రజిని

అభివృద్ధిని మరచి వేధింపులపై దృష్టి

నాదెండ్ల: వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు, వేధింపులకు కేటాయించిన సమయాన్ని అభివృద్ధిపై వెచ్చిస్తే నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కారమౌతాయని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. నాదెండ్ల మండలం తూబాడు గ్రామంలో మండలస్థాయిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ అధికార ప్రతినిధి ఉడతా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివద్ధి పనులను కూడా స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తన ఖాతాలో వేసుకోవటం హాస్యాస్పదమన్నారు. సూపర్‌సిక్స్ పేరిట కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేకపోయిందని, ప్రతి పథకంలో కోతలు విధిస్తూ అన్ని వర్గాల ప్రజలను వంచించిందన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు మంగు ఏడుకొండలు, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు గుంజి శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు అల్లడి రవికుమార్, బత్తుల సీతారామిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు చందు, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, జెట్టి బొల్లయ్య, కాట్రగడ్డ రామకష్ణ, పలు విభాగాల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాన్ని అందరికీ తెలియచేద్దాం

బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు



హాజరైన నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసం ఇంటింటికీ తెలియ చేయడమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల లక్ష్యం కావాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి రామిరెడ్డిపేటలోని ఓ పంక్షన్ హాలులో పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా అధ్యక్షతన నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసి మాట్లాడారు. చంద్రబాబు అంటేనే మోసమనే విషయం మరోసారి నిరూపితమౌతుందన్నారు. అన్నీ రంగాల్లో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లకు రూ.3.80 లక్షల కోట్లు అప్పుచేస్తే ఇప్పుడు బాబు కేవలం 13 నెలలకే రూ.1.75 లక్షల కోట్లు అప్పుచేశాడని, ఆ డబ్బు ఎక్కడికి పోయిందో అంతుబట్టడం లేదన్నారు. నూతన పింఛన్లు, రేషన్ కార్డులు ఏ ఒక్కరికీ ఇవ్వ లేకపోయారన్నారు. తల్లికి వందనం అమలులో కూడా ప్రజలను మోసం చేశాడని, శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే తన నియోజకవర్గంలోని ఓ స్కూలులో 59 మంది విద్యార్థులకు తల్లికి వందనం అమలు కాలేదని చెప్పటం ద్వారా తేటతెల్లమౌతుందన్నారు. ఈ పథకం కోసం శ్రీకాకుళంలో మహిళలు ధర్నా చేశారన్నారు. తాను చేస్తున్న మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు లేని లిక్కర్ స్కాం జరిగినట్లుగా ప్రచారం చేస్తూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి చుట్టూ ఉన్న వారందరినీ అరెస్టు చేస్తున్నారన్నారు. అందులో భాగమే ఎంపీ మిధున్‌రెడ్డి అరెస్టు అన్నారు.

కుప్పం నియోజకవర్గంలో బలమైన అభ్యర్థిని నిలబెట్టి మున్సిపాల్టీని గెలిపించుకోవటంపై బాబు పగబట్టి కేసులో ఇరికించాడన్నారు. మిధున్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ బాసటగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తుప్పుపట్టిన ఆర్టీసీ బస్సులతో ఫ్రీబస్సు పథకం మొదలు పెట్టబోతున్నారంటూ రాయచోటి మాజీ ఎమ్మెల్యే కుమారుడు రమేష్ రెడ్డి అన్నందుకు అతడిని అరెస్టుచేశారని వివరించారు. రాజధాని విషయంలో ఐదువేల ఎకరాల్లో ఎయిర్ పోర్టు, 1500 ఎకరాల్లో రైల్వేస్టేషన్ నిర్మాణాలు లాంటి అభూత కల్పనలు, బూటకపు మాటలతో చేస్తున్న మోసాన్ని అక్కడి రైతులు గమనించారన్నారు. మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుండగా నరసరావుపేటలో తాగునీరు సక్రమంగా సరఫరా కావట్లేదని, ఎక్కడి చెత్త అక్కడనే పేరుకుపోయిందన్నారు. వచ్చే ఆదివారం నుంచి మోర్ సెంటర్ నుంచి గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ప్రజాసమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లటమే దీని ఉద్దేశ్యమన్నారు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియచేస్తూ గత ఐదేళ్లలో మనం ఏమిచేశామో చెప్పుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, ఉదయించే సూర్యుడిని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. సమావేశంలో ఇంటలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఇయం. స్వామి, సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్లు ఎస్.సురేంద్ర, అచ్చిశివకోటి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్, మాదిగ, గిరిజన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు కందుల ఎజ్రా, పాలపర్తి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, నాయకులు ఎన్‌కే ఆంజనేయులు, షేక్ ఖాదర్‌బాష, అన్నామోహన్ మాట్లాడగా, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మాజీ అధ్యక్షులు కిషోర్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టార్గెట్ చేసి.. దొంగిలించేస్తాడు

- ఖాళీగా ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీ
- హెల్మెట్ ధరించి మరీ దొంగతనం!
- నగదుతో పాటు వెండి, బంగారం చోరీ



యడ్లపాడు: ఇంటికి తాళం పడిందని తెలుసుకున్న దొంగలు ఓ వృద్ధురాలి ఇంటిని టార్గెట్ చేసి దొంగతనానికి పాల్పడ్డారు. సుమారు రూ. 30 వేల నగదుతో పాటు 4 గ్రాముల బంగారం, 40 గ్రాముల వెండి వస్తువులను చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యడ్లపాడు మండలం మైదవోలు గ్రామానికి చెందిన బంగారు వరలక్ష్మి హైదరాబాదులో కుమారుడి వద్ద ఉంటూ అప్పుడప్పుడు స్వగ్రామమైన మైదవోలులోని ఇంటికి వచ్చి వెళ్తుంది. ఈనెల 1న మైదవోలు వచ్చి తిరిగి హైదరాబాదుకు వెళ్లింది. అప్పటి నుంచి ఇల్లు తాళం వేసి ఉండటం గమనించిన గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం పొరుగువారు వరలక్ష్మి ఇంటితాళం పగులగొట్టి ఉండటం గమనించి ఆమెకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. హుటాహుటిన గ్రామానికి వచ్చిన వరలక్ష్మి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, వస్తువులన్నీ ఇంట్లో చిందరవందరగా పడి ఉండటాన్ని చూసి షాక్‌కు గురైంది. బీరువాలో దాచిన నగదు, వెండి, బంగారం, అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించారు. సీసీ కెమెరాల్లో శనివారం అర్ధరాత్రి సమయంలో హెల్మెట్ ధరించిన దుండగులు ఇంటి ప్రధాన ద్వారం వద్ద తాళం పగలగొట్టి లోనికి వెళ్లిన దృశ్యాలు కనిపించాయి. క్లూస్ టీం ద్వారా ఘటన తాలూకు ఆధారాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

ఫేస్ రికగ్నైజ్ యాప్‌ను రద్దుచేయాలి



వినుకొండ: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు, మినీవర్కర్లకు లబ్ధిదారులకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేస్ రికగ్నైజ్ యాప్‌ను రద్దుచేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక సీడీపీవో కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లుకు ఇచ్చిన ఫోన్లు సాంకేతిక లోపంతో సక్రమంగా పనిచేయక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం ఇస్తున్న 2 జీబీ రీచార్జ్ సరిపోవడం లేదని, మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అనంతరం వినతి పత్రాన్ని ఇన్‌చార్జి సీడీపీవో అనూరాధకు అందజేశారు. కార్యక్రమంలో అంగనవాడీకార్యకర్తలు, పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు వాటర్ డిస్పెన్సర్ బహూకరణ

నరసరావుపేట ఈస్ట్: పల్నాడురోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో సోమవారం వాటర్ డిస్పెన్సర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ కనపర్తి కరుణాకరరావు, కళాశాల ఇన్‌చార్జ్ డాక్టర్ కాకాని సుధాకర్, అధ్యాపకులు డాక్టర్ నయీమ్, డాక్టర్ దీప, బ్యాంక్ సిబ్బంది గంగాధర్, శ్రావణి, శ్రావ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఎన్‌లో ఫ్యాకల్టీ అభివృద్ధిపై కార్యక్రమం



డాక్టర్ పి.అజయ్‌కుమార్ రెడ్డిని సత్కరిస్తున్న ప్రిన్సిపల్

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో మల్టీమీడియా క్వాలిటీ అసెస్మెంట్ టెక్నిక్స్, లాటెక్స్ టూల్ అంశంపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం సోమవారం నిర్వహించారు. చెన్నై ఎస్ఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సీఎస్ఈ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.అజయ్ కుమార్ రెడ్డి రీసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. వివిధ కళాశాలలకు చెందిన 35 మంది అధ్యాపకులు హాజరయ్యారు. మల్టీ మీడియా విశిష్టత, లాటెక్స్ టూల్ మంచి పేపర్స్ పబ్లిష్ చేసేందుకు ఉపయోగాన్ని తెలియజేశారు. ఓంని డైరక్షనల్ అండ్ స్టీరియోస్కోపిక్ ఇమేజెస్ క్వాలిటి అసెస్మెంట్, లాటెక్స్ మీద హ్యాండ్స్ ఆన్ సెషన్ తీసుకున్నారు. చైర్మన్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ లాటెక్స్ టూల్ వినియోగం కలిగే ప్రయోజనాలను వివరించారు. రీసోర్స్‌పర్సన్ అజయ్‌కుమార్ ఈ రంగంలో ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో నేర్చుకున్న మెథడాలజీని కళాశాలలో టీచింగ్‌లో ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ఎస్.కిషోర్ బాబు, కన్వీనర్ డాక్టర్ ఎ.గంగాధర్, ఎఫ్‌డీపీ కో ఆర్డినేటర్ సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

జోరు వర్షంలో సైతం సమ్మె శిబిరం కొనసాగించిన మున్సిపల్ కార్మికులు



వర్షం కారణంగా కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో నాయకులు, కార్మికులు


నరసరావుపేట: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను తీర్చటంలో ప్రభుత్వ మొండివైఖరి విడనాడాలని సీఐటీయూ నాయకులు కోరారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారంతో తొమ్మిదో రోజుకు చేరింది. జోరున వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా కార్మికులు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో కొనసాగుతూ ప్రభుత్వ తీరును నిరసించారు. జీఓ నంబరు 36 ప్రకారం కేటగిరీ వారీగా ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు చెల్లించాలని, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు అమలు చేయాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేస్తూ జీఓలు జారీ చేయాలంటూ నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు సిలార్ మసూద్, షేక్ చిన్న అల్లాభక్షు, కార్మికులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

రొంపిచర్ల: స్థానిక దాసరిపాలెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం కేంద్రంలో సోమవారం బోనస్ పంపిణీ చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరమునకు గాను 110 మంది పాల ఉత్పత్తిదారులకు ధరల వ్యత్యాసం కింద రూ.4,45,000 రూపాయలు పంపిణీ చేశారు. రూ.100 రూపాయలకు రూ.9 రూపాయల చొప్పున పంపిణీ చేశారు. వాటిలో సంగం డెయిరీ వాట్ ఆర్ ద రూ.2,23,000 రూపాయలు, పాల కేంద్రం నిధుల నుండి రూ.2,22000 రూపాయలు అందించారు. కేంద్రానికి అత్యధికంగా పాలు పోసిన షేక్ హసన్ అహమ్మద్ ధరల వ్యత్యాసం కింద రూ.27 వేల రూపాయలు, రూ.2 వేల రూపాయలు ప్రోత్సాహక బహుమతి, అలాగే మన్నం లక్ష్మీనరసింహారావుకు రూ.16,600 రూపాయల ధరల వ్యత్యాసం క్రింద రూ.1600 రూపాయల నగదు ప్రోత్సాహక బహుమతి, మూడవ వారికి రూ.16,580 ధరల వ్యత్యాసం క్రింద రూ.1400 రూపాయలు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంగం డెయిరీ నరసరావుపేట చిల్లింగ్ సెంటర్ మేనేజర్ నరేష్ వారికి ఈ మొత్తాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు గోపు ఆదెయ్య, మాజీ అధ్యక్షులు మన్నం లక్ష్మీనరసింహారావు, సెక్రటరీ సాగి రామారావు, టెస్టర్ జె.వి. కోటయ్య, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయండి

ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ

నూజెండ్ల: గ్రామాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జి.వి. అంజనేయులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ, చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు, జిల్లా జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.వి.మాట్లాడుతూ రానున్న సీజన్ ను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురుగు నిల్వలు లేకుండా పంచాయతీ సెక్రటరీలు పారిశుధ్య పనులు చేయించాలన్నారు. సమావేశంలో పాల్గొన మరో ముఖ్యఅతిధి జిల్లా జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు మాట్లాడుతూ రానున్న వ్యవసాయ సీజన్‌లో రైతులకు సొసైటీల ద్వారా సహకార రుణాలు త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తామన్నారు.

చినుకు పడితే కరెంటు నిలువదాయె...

చిన్నపాటి వాన, గాలికి జడ్డావారిపాలెం, చెరుకుంపాలెం తదితర గ్రామాల్లో కరంట్ సరఫరా నిలిచిపోతోందని గురప్పనాయుడు పాలెం సొసైటీ అధ్యక్షులు ముండ్రు సుబ్బారావు సమావేశంలో విద్యుత్ అధికారులను నిలదీశారు. పొలాల్లో విద్యుత్ స్తంభాలు తొలగించి రహదారి వెంట ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందన్నారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామని ఏఈ సుధాకర్ బదులిచ్చారు.

సమావేశానికి రెవెన్యూ అధికారుల డుమ్మా

సర్వసభ్య సమావేశానికి రెవెన్యూ అధికారులు గైర్హాజవడంతో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. సమావేశానికి రాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో పి.ఉమాదేవి అన్నారు. సమావేశంలో వివిధ శాఖాధికారులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ లగడపాటి వెంకట్రావు వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ మురళీకృష్ణ యాదవ్, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతుల ప్రగతికి కృషి చేయాలి

నూజెండ్ల: ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రైతులకు మేలు చేయాలని చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు అన్నారు. నూజెండ్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) నూతన పాలక వర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బచ్చు అంజిరెడ్డి, సభ్యులుగా ఎన్నికైన గంగినేని బ్రహ్మయ్య, మాందా ఏసులచే ప్రమాణ స్వీకారం చేయించారు.

జీవన ఎరువులను వినియోగించాలి



మాట్లాడుతున్న డీడీఏ ఎం.శివకుమారి

నరసరావుపేట రూరల్: రసాయన ఎరువులకు బదులు జీవన ఎరువులు వినియోగించడం వలన నేల భౌతిక స్వరూపం మారకుండా ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. మండలంలోని పాలపాడులో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం రైతులకు శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట పంటలను భూమిలో కలియదున్నడం వలన భూసారాన్ని పెంచుకోవడంతో పాటు రసాయన ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. రసాయన ఎరువులు కాకుండా జీవన ఎరువులైన ఫాస్పరస్ సాల్యూబులైజింగ్ బ్యాక్టీరియాను వాడటం వలన ఖర్చు తగ్గుతుందని సూచించారు. వరి, మొక్కజొన్న పంటల్లో కలుపు యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ చర్యలు గురించి తెలియజేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో వరి సాగు చేసే రైతులు ఎకరానికి రూ.80లు ప్రిమియంగా చెల్లించి ఆగస్టు 15వ తేదీలోగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి, గ్రామ పెద్దలు పి.రామిరెడ్డి, వై.లింగయ్య, వ్యవసాయ సహాయకుడు వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ లోకనాథం

నరసరావుపేట టౌన్: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ సీహెచ్ లోకనాథం అన్నారు. సోమవారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నిబంధనలకు లోబడి వాహనాలు నడిపితే ప్రమాదాలు దరిచేరవు అన్నారు. వాహనాలు నడిపేవారు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణం ప్రమాదకరమన్నారు. సమాజంలో చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలకు కారణం నిబంధనలు పాటించకపోవటమేనన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ వేణు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టిని తవ్వేసి వెంచర్లకు వాడుకుంటున్నారు

కూటమి నేతల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన న్యాయవాది, బాధితులు



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది బేబీరాణి, బాధితులు

నరసరావుపేట: మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో 2006లో వడియరాజులకు ఇచ్చిన ఇళ్లపట్టాలలోని మట్టిని కూటమి నాయకులు తమ వెంచర్లకు తరలించుకుంటూ దారి నిర్మిస్తూ ప్రశ్నించిన వారిని మీకు స్థలాలు లేవు అంటూ బెదిరిస్తున్నారని ఏపీ వడియరాజుల సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు, హైకోర్టు న్యాయవాది వేముల బేబీ రాణి పేర్కొన్నారు. సోమవారం గ్రామానికి చెందిన బాధితులతో కలిసి పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌ను కలిసి సమస్య విన్నవించారు. అనంతరం ఆమె, బాధితులు మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో ఉన్న 16 మంది వడ్డెరలకు 2006 దివంగత వైఎస్సార్ పాలనలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారంటూ ఆ పట్టాలు చూపించారు. అప్పటి నుంచి ఆస్థలాలో లబ్ధిదారులు గుడిసెలు వేసుకొని ఉంటున్నారన్నారు. గత కొంతకాలంగా వర్షాల వలన నీరు నిల్వ ఉండటంతో వారందరూ ఖాళీచేసి గ్రామంలో అద్దె ఇళ్లల్లో ఉంటున్నారన్నారు. అధికార కూటమి పార్టీలకు చెందిన నాయకులు దాదాపు 15 ఎకరాల్లో వెంచర్లు వేసి 16 మంది లబ్ధిదారుల స్థలాలు నుంచి మట్టి త్రవ్వి వారి వెంచర్‌కు వేసుకుంటున్నారన్నారు. అదేంటి అని అడిగితే ఇక్కడ మీకు స్థలాలు లేవు, మీరే ఏం చేస్తారు, మీ చేతనైంది చేసుకోండి అంటూ తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధిత మహిళలు పేర్కొన్నారు. సమస్యను కలెక్టర్‌కు విన్నవించగా 15 రోజుల సమయంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారన్నారని, పరిష్కారం జరగకపోతే హైకోర్టును ఆశ్రయించి న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని బేబీరాణి వెల్లడించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవళ్ళ వేలాద్రి, యువజన సెక్రటరీ ఉప్పతల దేవరాజు, పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు వేముల శ్రీదేవి, వడ్డెర కుల పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

తల్లీ పిల్లల ఆసుపత్రి నిర్మాణం చేయాలి

చిలకలూరిపేట: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని పాత ప్రభుత్వాసుపత్రికి చెందిన ఖాళీ స్థలంలో ప్రభుత్వ తల్లీపిల్లల ఆసుపత్రి నిర్మించాలని ఆసుపత్రి సాధన కమిటీ కార్యదర్శి నాయుడు శివకుమార్ కోరారు. ప్రభుత్వ తల్లీ పిల్లల ఆసుపత్రి సాధన కమిటీ విజ్ఞప్తి మేరకు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ వినయ్, మండల సర్వేయర్ ప్రసాద్‌తో కలసి సోమవారం పాత ప్రభుత్వాసుపత్రి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయుడు శివకుమార్ మాట్లాడుతూ తల్లీ పిల్లల ఆసుపత్రి నిర్మాణం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు కమిటీ ఆధ్వర్యంలో పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షుడు జమాల్‌బాషా, అధ్యక్షుడు చేవూరి కృష్ణమూర్తి, సభ్యులు పేలూరి రామారావు, తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

జేసీపై చర్యలు తీసుకోవాలి

వినుకొండ: వాల్మీకి వర్గాన్ని కించపరిచే వ్యాఖ్యల చేసిన జేసీ ప్రభాకర్ పై చర్యలు తీసుకోవాలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు భోగాల చిన్నమ్మాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జేసీ వ్యాఖ్యలు పూర్తి ఖండనీయమని, అత్యంత బాధాకరమని అన్నారు. వాల్మీకి వర్గం శ్రమజీవ వర్గం, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ వర్గంపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం మానవతా విలువలకు విరుద్ధమన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు సామాజిక ఐక్యతను దెబ్బతీసేలా ఉంటాయని, జేసీ ప్రభాకర్‌రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని, టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జేసీపై చర్యలు తీసుకోకపోతే తాడిపత్రి పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.